కూచిపూడిలో భళా

- ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శనలు
- చిన్న వయస్సులోనే రాణిస్తున్న నెల్లూరు బాలిక



కూచిపూడి నృత్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): తల్లిదండ్రుల అభిరుచులు మారుతున్నాయి. తమ పిల్లలను నాలుగు గోడల మధ్య చదువులకే పరిమితం చేయకుండా వారికి నచ్చిన అంశాలవైపు దృష్టి సారించేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరుప్రాయంలోనే ఆయా రంగాల్లో రాణిస్తూ ప్రతిభ చూపుతున్నారు. క్రీడల్లో కొందరు ప్రతిభ చూపుతుంటే, మరికొందరు శాస్త్రీయ నృత్య తదితరాల్లో రాణిస్తున్నారు. ఈ కోవలోకే నవాబుపేటకు చెందిన సంజన కసిరెడ్డి నిలుస్తోంది. బాల్యంలోనే తనకిష్టమైన కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది 11 ఏళ్లకే రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాల్లో 30కుపైగా ప్రదర్శనలిచ్చి ఎందరో ప్రశంసలను అందుకుంటోంది.

ఉత్తమ ప్రతిభతో బహుమతులు

కసిరెడ్డి ప్రదీప్‌రెడ్డి, నాగవేణి కుమార్తె సంజన నగరంలోని ఓ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచే నాట్యంపై ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సహించారు. నగరంలోని నందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రంలో నాట్య గురువు జ్యోత్స్న వద్ద తొమ్మిదేళ్లకే నాట్యంలో శిక్షణ పొందారు. తొలి ప్రదర్శనను శ్రీకాళహస్తిలో.. తదుపరి శ్రీశైలం, కాణిపాకంతో పాటు పలు ప్రసిద్ధ ఆలయాల్లో నాట్య ప్రదర్శనలిచ్చి ప్రశంసలను పొందారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో రాయలసీమ రంగస్థలి వారు నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ చూపి బహుమతి సాధించారు. నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి, మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయాలు, శబరి శ్రీరామక్షేత్రంలో ప్రదర్శనలను నిర్వహించారు.

శాస్త్రీయ నృత్య ప్రదర్శనలకు ఎంపిక

కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలంలో నాట్య ప్రదర్శన చేశారు. శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తిలో నిర్వహించనున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శనలకు ఎంపికయ్యారు. ఓ వైపు శాస్త్రీయ నృత్య సాధన చేస్తూనే మరోవైపు చిత్రకళలోనూ శిక్షణ పొందుతున్నారు.

నృత్యమంటే చాలా ఇష్టం



"శాస్త్రీయ నృత్యమంటే చాలా ఇష్టం. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. చదువుతూనే మంచి నృత్య కళాకారిణిగా ప్రదర్శనలివ్వాలని ఉంది.

– సంజన

దత్తనాథ క్షేత్రాల పరిపుష్టికి సహకారం



గో పూజ నిర్వహిస్తున్న గణపతి సచ్చిదానంద



సంగీత సేవలో సర్వేపల్లి సోదరీమణులు

నెల్లూరు(బృందావనం): మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దత్తనాథ క్షేత్రాల్లో ధూపదీప నైవేద్య పథకానికి ప్రతి క్షేత్ర పరిధిలో రూ.కోటి కార్పస్ ఫండ్ ఉండేలా చూసుకోవాలని అవధూత దత్తపీఠాధీశ్వరుడు గణపతి సచ్చిదానంద పేర్కొన్నారు. దత్తక్షేత్ర యాత్రలో భాగంగా సుజాతమ్మ కాలనీలోని దత్తనాథ క్షేత్రాన్ని అవధూత దత్త పీఠ ఉత్తరాధిపతి విజయానందతీర్థతో కలిసి ఆదివారం సందర్శించారు. రూ.కోటి నిధి లేని దత్తక్షేత్రాల నిర్వహణకు మిగిలిన మొత్తాన్ని అవధూత దత్తపీఠం ట్రస్ట్ నుంచి మంజూరు చేయనున్నామని వెల్లడించారు. నెల్లూరు క్షేత్రానికి ఉన్న ఫండ్‌కు రూ.37 లక్షలను అందజేశారు. భగవద్గీతను అభ్యసించి దత్తపీఠం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులకు మంగళశాసనాలను గణపతి సచ్చిదానంద అందజేశారు. నెల్లూరు దత్తక్షేత్ర ప్రాంగణంలోని ఆలయాల అభివృద్ధి పనులకు సహకారాన్ని అందించిన దాతలను అభినందించారు. రాధాకృష్ణ ధ్యాన మండపంలో కృష్ణామృత రాగసాగర నాద ధ్యాన చికిత్స కచేరిని జరిపారు. తొలుత కృష్ణ యోగ మందిరం, అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో కొలువైన గణపతి, కృష్ణుడు, అష్టలక్ష్మి అమ్మవారు, కార్యసిద్ధి ఆంజనేయస్వామి, నాగేశ్వరస్వామి తదితర దేవతామూర్తులకు పూజలు చేశారు. గణపతి సచ్చిదానంద దివ్యనామ సంకీర్తనలతో సంగీత సేవను సర్వేపల్లి సోదరీమణుల ఆధ్వర్యంలో, సంగీత కళాకారులు, భక్తబృందం నిర్వహించారు. గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్, నెల్లూరు మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పచ్చిపాల ప్రమీలమ్మ, అనపల్లి మస్తాన్‌రెడ్డి, అనపల్లి అశోక్‌రెడ్డి, ఫణిరత్నం, డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న, రేబాల పట్టాభిరామిరెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థికి బహుమతి ప్రదానం

కోవూరు: పట్టణంలోని టీఎన్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ సికిందర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీవీఈఓ మధుబాబు, ఎస్సై రంగనాథ్‌గౌడ్, కళాశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ షాలిని హాజరయ్యారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు చేశారు. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను దాతల సహకారంతో అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథులను కళాశాల సిబ్బంది సత్కరించారు.

దండిగుంట సర్పంచ్‌కు పరామర్శ



విడవలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులోని ఓ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న దండిగుంట సర్పంచ్ బెల్లంకొండ సుప్రజను కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, దంపూరు సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి, విడవలూరు వైస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గణపతిరావు



కొడవలూరు: బీసీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రుద్రపంతి గణపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడారు. నార్తు రాజుపాళెంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి బీసీలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కాగా ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు.

కనులపండువగా మహాకుంభాభిషేకం



ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో పుష్కర మహాకుంభాభిషేకాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. వేదపండితుడు నూతలపాటి సుబ్బయ్యశాస్త్రి బృంద మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం సాగింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కాలబైరవస్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను జరిపారు. ఆయా కార్యక్రమాలకు ఉభయకర్తలుగా కొండూరు సుధాకర్‌రెడ్డి, సులోచనమ్మ, దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి, దుగ్గా శంకర్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు. అన్నప్రసాదాన్ని అందజేశారు. పూజా కార్యక్రమాలకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు నూతలపాటి అనిల్‌శర్మ, రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణప్రసాద్, కోడూరు కమలాకర్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, కొండూరు సుధాకర్‌రెడ్డి, ఈఓ తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- అమ్మవారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. పార్టీ నేతలు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనీ టైమ్ మద్యం

- బరితెగిస్తున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ



నిర్ణీత సమయానికి ముందే నగరంలోని ఓ బార్‌లో మద్యం విక్రయాలు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో మద్యం వ్యాపారులు బరితెగిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ రాత్రీ, పగలనే తేడా లేకుండా విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకొంటున్నారు. జిల్లాలో 50 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. నిబంధనల మేరకు వీటిలో ఉదయం పది నుంచి రాత్రి 11 వరకు మద్యం విక్రయాలను సాగించాలి. రెస్టారెంట్‌కు ఆపై గంట అదనపు అనుమతి ఉంటుంది. నైట్ సేల్స్‌ను నిర్వహించరాదు. అయితే కొందరు బార్ నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘించి దొడ్డిదారిన తెల్లవారుజాము నుంచే విక్రయాలను సాగిస్తున్నారు. మరికొందరు బహిరంగంగానే షాపులను తెరిచి విక్రయాలు జరుపుతున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే, మారుమూల ప్రాంతాల్లో ఏ విధంగా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్

నెల్లూరు రూరల్: రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. జిల్లాలోని డెల్టా ప్రాంతంలో జరుగుతున్న వరి కోతలను ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తాం

నెల్లూరు రూరల్: ప్రపంచం స్మరించదగ్గ వ్యక్తి అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణగౌడ్ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, నేతలు అడపాల మదన్‌సాయిరెడ్డి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఉచిత దీవెన యాత్ర నేడు

నెల్లూరు(బృందావనం): రథసప్తమిని పురస్కరించుకొని తిరుమల శ్రీవారి ఉచిత దీవెన యాత్రను సోమవారం నిర్వహించనున్నామని సత్యమార్గ్ ఫౌండేషన్ నిర్వాహకుడు పూడి రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురమందిర సమీపంలోని జ్యోతి వినాయకస్వామి ఆలయం నుంచి ప్రారంభంకానుందని చెప్పారు.

సామూహిక అక్షరాభ్యాసం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించనున్నామని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులకు పుస్తకాలు, బలపాలు, పెన్నులతో పాటు రవ్వ లడ్డూను ప్రసాదంగా అందజేయనున్నామని చెప్పారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర క్యాలెండర్లు, పాకెట్ డైరీని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి ఫణీంద్రకుమార్, ఉపాధ్యక్షులు చెన్నకేశవులు, కమతం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పుస్తక మహోత్సవం



నెల్లూరు(బృందావనం): వీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో సింహపురి పుస్తక మహోత్సవం కొనసాగుతోంది. ఆర్ద్ర సాహిత్య వేదికపై వివిధ కార్యక్రమాలను జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పద్యాలను చిన్నారి ధ్రువకుమార్‌రాజు ఆలపించారు. డాక్టర్ శ్రీనునాయక్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జేవీవీ నేత చలపతి, ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కాలేషాబాషా, విశ్రాంత ఉపాధ్యాయురాలు విజయమ్మ, పార్వతీశం, విజయకుమార్, సుబ్రహ్మణ్యం, నాగరాజు, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి గోపీనాథ్, హరిబాబు పాల్గొన్నారు.

పోలీస్ సేవలను చేరువ చేయాలి



నెల్లూరు(క్రైమ్): పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని నగర డీఎస్పీ సింధుప్రియ పేర్కొన్నారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం తనిఖీ చేసిన ఆమె స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలు, సిబ్బంది యోగక్షేమాలను ఆరాతీశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను విని సత్వరమే పరిష్కరించాలని కోరారు. ట్రెయినీ డీఎస్పీ శివప్రియ, ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతుల ప్రదానం

- పశు సంవర్ధక శాఖ జేడీ రమేష్

నెల్లూరు(సెంట్రల్): సమాజంలో జంతు సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ పేర్కొన్నారు. జనవరి 14 నుంచి 30 వరకు నిర్వహించిన జంతు సంక్షేమ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నెల్లూరులోని రైల్వేఫీడర్స్ రోడ్డులో గల పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. అన్ని రకాల మూగజీవాలపై ఆదరణ చూపాలని కోరారు. అనంతరం షీప్ డెవలప్‌మెంట్ సహాయ సంచాలకులు మాధవీలత మాట్లాడారు.

జంతు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. జంతు సంరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పలు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించామని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి ప్రశంసపత్రాలు, బహుమతులను అందజేశారు.

బకాయిలను తక్షణమే చెల్లించాలి



మాట్లాడుతున్న మంజుల

నెల్లూరు(పొగతోట): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల డిమాండ్ చేశారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఏపీటీఎఫ్ ఉద్యమ సారథి నూతలపాటి పరమేశ్వరరావు సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. పీఆర్సీ కమిటీని తక్షణమే వేయాలని చెప్పారు. పంచాయతీ స్థాయిలో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసినా, ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమ కార్యక్రమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దశరథరాములు తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌వలీ నిషాన్ దర్గా ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని 48వ డివిజన్ పరిధిలో గల పార్లుకట్ట జయలలితనగర్‌లో ఖాదర్‌వలీ నిషాన్ దర్గాను ఆదివారం పునఃప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిద్దిఖ్ తన సొంత నిధులతో పునర్నిర్మాణాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని పలు సమస్యలను ఆరాతీసి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడారు. డిప్యూటీ మేయర్‌గా ఖలీల్ అహ్మద్‌కు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అవకాశమిచ్చిన అంశాన్ని ప్రస్తావించారు. గత ఎన్నికల్లో పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థిగా ఆయనకు అవకాశం కల్పించారని తెలిపారు. పార్టీ గుర్తుపై కార్పొరేటర్లుగా గెలిచి ఎవరైతే ఫిరాయించారో వారు ఆత్మపరిశీలన చేసుకొని పార్టీ డిప్యూటీ మేయర్ అభ్యర్థి కరిముల్లాను గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ నేత ఖలీల్ అహ్మద్, 52వ డివిజన్ ఇన్‌చార్జి మహబూబ్‌బాషా, కార్పొరేటర్ నీలి రాఘవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలపై వెంకటేశ్వరపురం గాంధీగిరిజన కాలనీలో అవగాహన సదస్సును మహిళా పోలీసులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వీటి బారిన పడితే తక్షణమే 1930, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏహెచ్‌టీయూ ఏఎస్సైలు శ్రీహరి, సతీష్, సిబ్బంది ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో రథసప్తమి రేపు



మాట్లాడుతున్న గోపీ

నెల్లూరు సిటీ: వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నామని ఈఓ వేమూరి గోపీ పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. స్వామివారు సప్తవాహనాలపై విహరించనున్నారని చెప్పారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల సంఘ సమావేశం



నెల్లూరు(లీగల్): నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో నెల్లూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ సమావేశాన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘ కొత్త నాయకత్వ ఎన్నికల విషయమై గుంటూరులో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని కోరారు. సంఘ రాష్ట్ర సభ్యుడు వేణుగోపాల్‌నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్, శివకుమార్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని ఒకటో, రెండో డివిజన్లలో సీసీ రోడ్డు, ముస్లిం శ్మశాన వాటిక నిర్మాణానికి శంకుస్థాపనను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం చేపట్టారు. కోడూరు కమలాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పడిగినేటి రామ్మోహన్‌యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు కుడుముల చిరంజీవి, సాబీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.